

http://amaravathivelugu.com

RNI No. : APTEL/2022/85169

అమరావతి వెలుగు

సంచలన తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను

పాత్రికేయులుగా పని చేయాలన్న ఉత్సాహం
మీ ప్రాంత స్థితిగతులపై అవగాహన
తెలుగులో రాయగలిగిన భాషా పరిజ్ఞానం ఉన్న
ఔత్సాహికులకు ఇదే మా ఆహ్వానం

అనంతపురం జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల్లో
న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలెను.
విషయ పరిజ్ఞానంతో పాటు సామాజిక,
రాజకీయ అవగాహన కలిగి స్థానికులై ఉండాలి.
వివరాలకు సంప్రదించండి :
జానపాటి వెంకట రమేష్ బాబు
9440814576 ఎడిటర్

సంపుటి : 04 సంచిక : 182 ప్రచురణ : శ్రీ సత్యసాయి/అనంతపురం ఎడిటర్ : జానపాటి వెంకట రమేష్ బాబు మంగళవారం, నవంబరు 03, 2026 పేజీలు : 4 వెల : ₹2/-

Circulated at Guntur, Palnadu, Bapatla, Chittoor, Tirupati, Madanapalli, Kurnool, Nandyal, Visakapatnam, Vijayawada, Kadikana, Kadapa, Nellore, Rajamendravaram




ఆ భూముల ఫ్రీహోల్డ్ దరఖాస్తుల...

పరిష్కారానికి గడువు..!!

ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు

- ఈ భూములకు సంబంధించిన ఫ్రీహోల్డ్ దరఖాస్తుల పరిష్కారానికి కాలపరిమితులు విధించింది
- ఆర్డీవో పరిధిలో దరఖాస్తులకు 60 రోజుల్లో పరిష్కారం చూపాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది
- నిర్దిష్ట కేటగిరీ దరఖాస్తులను 30 రోజుల్లో పరిష్కరించాలని నిర్దేశించింది
- తహసీల్దార్ స్థాయిలో దరఖాస్తుల పరిష్కారానికి 60 రోజుల సమయం తీసుకొవచ్చని సూచించింది
- ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన రోజే తహసీల్దార్ లాగిన్‌కు చేరేలా ప్రభుత్వం సాంకేతిక మార్పులు తీసుకొచ్చింది
- వెబ్‌ల్యాండ్‌లో ఫ్రీహోల్డ్ నమోదైన వెంటనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చని చెప్పింది
- వెబ్‌ల్యాండ్ వివరాలు రికార్డుల్లో భద్రపరచాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది

అమరావతి : అసైన్డ్, చుక్కల, ఇనాం, పట్టా భూములపై వచ్చే ఫ్రీహోల్డ్ దరఖాస్తుల విషయంలో ఏపీ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ భూములకు సంబంధించిన ఫ్రీహోల్డ్ దరఖాస్తుల పరిష్కారానికి కాలపరిమితులు విధించింది. ఆర్డీవో పరిధిలో దరఖాస్తులకు 60 రోజుల్లో పరిష్కారం చూపాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. నిర్దిష్ట కేటగిరీ దరఖాస్తులను 30 రోజుల్లో పరిష్కరించాలని నిర్దేశించింది. అలాగే తహసీల్దార్ స్థాయిలో దరఖాస్తుల పరిష్కారానికి 60 రోజుల సమయం తీసుకొవచ్చని సూచించింది. ఈ మేరకు ప్రభుత్వం జీవో 659 జారీ చేసింది. కాగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన రోజే తహసీల్దార్ లాగిన్‌కు చేరేలా ప్రభుత్వం సాంకేతిక మార్పులు తీసుకొచ్చింది. వెబ్‌ల్యాండ్‌లో ఫ్రీహోల్డ్ నమోదైన వెంటనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చని చెప్పింది. ఇందుకోసం ఫ్రీహోల్డ్ ప్రొసీడింగ్స్ సమర్పించాల్సిన అవసరం లేదని వెల్లడించింది. వెబ్‌ల్యాండ్ వివరాలు రికార్డుల్లో భద్రపరచాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.



టికెట్ ధరలు ఎక్కువగా ఉంటే

విమానాల్లో వెళ్లొద్దు

: సుప్రీం కోర్టు

విమాన టికెట్ల చార్జీలు ఈ మధ్య కాలంలో 700 శాతం మేర పెరిగాయి.. టికెట్ ధరల్లో భారీ పెరుగుదల రాజ్యాంగంలోని 14 అధీకరణను ఉల్లంఘిస్తోంది

విమాన టికెట్ ధరల విషయంలో దాఖలైన ఓ పిటిషన్‌పై సుప్రీం కోర్టు తాజాగా ఘాటు వ్యాఖ్యలు చేసింది. ధరలు ఎక్కువగా అనిపిస్తే విమాన ప్రయాణాలు చేయొద్దని తేల్చి చెప్పింది. అంతకుముందు పిటిషనర్ తరపు న్యాయవాది మాట్లాడుతూ విమాన టికెట్ల చార్జీలు ఈ మధ్య కాలంలో 700 శాతం మేర పెరిగాయని తెలిపారు. విమానయానం కూడా ..2వ పేజీలో

తెలంగాణలో కాంగ్రెస్‌ను కూకటివేళ్లతో...

పెకిలిస్తాం..!!

మహా పాదయాత్రలో అమిత్ షా

ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం - అరాచకవాదాన్ని అంతం చేద్దాం

- తెలంగాణలో కాషాయ పార్టీని అధికారంలోకి తీసుకురావాలంటే తనతోపాటే నినాదాలు చేయాలి
- ప్రజాస్వామ్యాన్ని కాపాడి, ఇక్కడి అరాచకశక్తులను తుదముట్టిద్దాం..
- త్వరలో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాబోతోందని కేంద్ర హోంమంత్రి ధీమా వ్యక్తం
- ఓట్ బచావో ర్యాలీ కాదని, అది చొరబాటుదారులను కాపాడే ప్రయత్నం
- 'రాహుల్ గాంధీ కూడా ఒక చొరబాటుదారుడు..కాంగ్రెస్.. చొరబాటుదారులను ఓటుబ్యాంక్‌గా చూస్తోంది
- చొరబాటదారుల ఓట్లు తొలగించొద్దా? ఒక వ్యక్తికి రెండు ఓట్లు ఉంటే తొలగించాలా.. వద్దా?
- సర్ ప్రక్రియను ఆపాలని కాంగ్రెస్ అండ్ కంపెనీ కుట్ర చేస్తోంది
- 13 కోట్ల ఓట్లు తొలగించారని రాహుల్ అబద్ధాలు చెబుతున్నారని అమిత్ షా ఆరోపించారు
- 'సర్ జరగకముందూ అనేక ఎన్నికల్లో బీజేపీ గెలిచింది....
- సర్ కారణంగానే మేం అధికారంలోకి వచ్చామని రాహుల్ అంటున్నారు
- మాక్ పార్లమెంట్‌లో వ్రధాని సీట్‌లో కూర్చొని సంబరపడాల్సిందేనని ఎద్దేవా
- ఈవీఎంలతోనే కేంద్రంలో బీజేపీ గెలిచిందనుకుంటే, తెలంగాణలో రేవంత్ ఎలా గెలిచారు.. : అమిత్ షా

2వ

హైదరాబాద్ : 'ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం - అరాచకవాదాన్ని అంతం చేద్దాం' పేరిట బీజేపీ నిర్వహిస్తున్న మహా పాదయాత్రలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాల్గొని ఆ పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచారు. తెలంగాణలో కాషాయ పార్టీని అధికారంలోకి తీసుకురావాలంటే తనతోపాటే నినాదాలు చేయాలని ఆయన ప్రజలను కోరారు. అనంతరం అమిత్ షా బహిరంగ సభలో ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలించేద్దామని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడి, ఇక్కడి అరాచకశక్తులను తుదముట్టిద్దామని చెప్పారు. త్వరలో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాబోతోందని కేంద్ర హోంమంత్రి ధీమా వ్యక్తం చేశారు.



రాహుల్ ఒక చొరబాటుదారుడు..


అనంతరం అమిత్ షా కాంగ్రెస్ పార్టీ పై మండిపడ్డారు. ఢిల్లీలో ఆ పార్టీ నిర్వహించింది ఓట్ బచావో ర్యాలీ కాదని, అది చొరబాటుదారులను కాపాడే ప్రయత్నమని ఆయన విమర్శించారు. 'రాహుల్ గాంధీ కూడా ఒక చొరబాటుదారుడు. కాంగ్రెస్.. చొరబాటుదారులను ఓటుబ్యాంక్‌గా చూస్తోంది. చొరబాటదారుల ఓట్లు తొలగించొద్దా? ఒక వ్యక్తికి రెండు ఓట్లు ఉంటే తొలగించాలా.. వద్దా?'అని ప్రశ్నించారు. దొంగ ఓట్లు తొలగిస్తుంటే రాహుల్‌కు కడుపుమండుతోందని ధ్వజమెత్తారు. సర్ ప్రక్రియను ఆపాలని కాంగ్రెస్ అండ్ కంపెనీ కుట్ర చేస్తోందని, 13 కోట్ల ఓట్లు తొలగించారని రాహుల్ అబద్ధాలు చెబుతున్నారని అమిత్ షా ఆరోపించారు. 'సర్ జరగకముందూ అనేక ఎన్నికల్లో బీజేపీ గెలిచింది. సర్ కారణంగానే మేం అధికారంలోకి వచ్చామని రాహుల్ అంటున్నారు. మరి రాహుల్ ఎంపీ అయింది కూడా సర్ వల్లేనా' అంటూ కేంద్ర హోంమంత్రి చురకలంటించారు.

> 'ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం - అరాచకవాదాన్ని అంతం చేద్దాం' పేరిట బీజేపీ నిర్వహిస్తున్న మహా పాదయాత్రలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాల్గొని ఆ పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచారు. అనంతరం ఆయన బహిరంగ సభలో ప్రసంగించారు.

'మురసు'ను ఎదుర్కొనేందుకు...

సర్వ సన్నద్ధంగా ఉండండి..!!

- కలెక్టర్లతో తుపాను సన్నద్ధతపై ఆయన సమీక్ష నిర్వహించారు
- దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమలో ఓ మోస్తరు నుంచి వర్షాలు కురిసే అవకాశం
- నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టుల పరిధిలో
- 30 నుంచి 50 టీంఎసీల వరకు నీటి ప్రవాహం వచ్చే అవకాశం ఉంది
- తుపాను గాలులతో దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో
- 8 వేల వరకు విద్యుత్ స్తంభాలు దెబ్బతినే అవకాశం ఉంది
- అర్నబ్ తుపాను విధ్వంసం నుంచి చాలా ప్రాంతాలు సాధారణ స్థితికి వచ్చాయి
- మురసు ప్రభావాన్ని కూడా సమర్థంగా ఎదుర్కోవాలి : సీఎం చంద్రబాబు



అమరావతి: 'మురసు' తుపానును సమర్థంగా ఎదుర్కొనేందుకు యంత్రాంగం సర్వ సన్నద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. అమరావతిలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ నుంచి అధికారులు, కలెక్టర్లతో తుపాను సన్నద్ధతపై ఆయన సమీక్ష నిర్వహించారు. దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు సీఎంకు వివరించారు. నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టుల పరిధిలో 30 నుంచి 50 టీంఎసీల వరకు నీటి ప్రవాహం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. తుపాను గాలులతో దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో 8 వేల వరకు విద్యుత్ స్తంభాలు దెబ్బతినే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. అర్నబ్ తుపాను విధ్వంసం నుంచి చాలా ప్రాంతాలు సాధారణ స్థితికి వచ్చాయని, మురసు ప్రభావాన్ని కూడా సమర్థంగా ఎదుర్కోవాలని సీఎం స్పష్టం చేశారు. తుపాను వర్షాలను నీటి వనరుల పెంపునకు వినియోగించుకోవాలని సీఎం సూచించారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, మార్కాపురం జిల్లాలతోపాటు రాయలసీమ పరిధిలోని చెరువులు, రిజర్వాయర్లను సమర్థ నీటి నిర్వహణతో నింపాలని సీఎం నిర్దేశించారు.

మురసు ఎఫెక్ట్..

పలు ఓడరేవుల్లో ప్రమాద హెచ్చరికలు



విమాన టికెట్ ధరల విషయంలో దాఖలైన ఓ పిటిషన్‌పై సుప్రీం కోర్టు తాజాగా ఘాటు వ్యాఖ్యలు చేసింది. ధరలు ఎక్కువగా అనిపిస్తే విమాన ప్రయాణాలు చేయొద్దని తేల్చి చెప్పింది. అంతకుముందు పిటిషనర్ తరపు న్యాయవాది మాట్లాడుతూ విమాన టికెట్ల చార్జీలు ఈ మధ్య కాలంలో 700 శాతం మేర పెరిగాయని తెలిపారు. విమానయానం కూడా అత్యవసర సేవే అని చెప్పారు. కాబట్టి టికెట్ ధరల్లో భారీ పెరుగుదల రాజ్యాంగంలోని 14 అధీకరణను (సమానత్వ హక్కు) ఉల్లంఘిస్తోందని చెప్పే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో జస్టిస్ విక్రమ్ నాథ్ నాయకత్వంలోని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. అలాంటప్పుడు విమాన ప్రయాణాలు చేయొద్దని స్పష్టం చేసింది. ..2వ పేజీలో

మురసు తీవ్ర తుపాను.. సహాయక చర్యలకు...

రూ.37 కోట్లు విడుదల

అమరావతి: మురసు తీవ్ర తుపాను దృష్ట్యా ముందస్తు సహాయక చర్యల కోసం 17 జిల్లాలకు ఏపీ ప్రభుత్వం రూ.37 కోట్లు విడుదల చేసింది. తుపాను ప్రభావం ఎక్కువగా ఉన్న నెల్లూరు, ప్రకాశం, మార్కాపురం, బాపట్ల, గుంటూరు, కృష్ణా జిల్లాలకు రూ. 3 కోట్ల చొప్పున, ఏలూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్, పల్నాడు, తిరుపతి, చిత్తూరు, నంద్యాల జిల్లాలకు రూ.2 కోట్ల చొప్పున నిధులు కేటాయించింది. కడప, సత్యసాయి, అన్నమయ్య జిల్లాలకు రూ.కోటి చొప్పున నిధులు విడుదల చేసింది. పునరావాస శిబిరాలకు ..2వ పేజీలో

టికెట్ ధరలు ఎక్కువగా ఉంటే విమానాల్లో వెళ్లొద్దు: సుప్రీం కోర్టు

(మొదటిపేజి తరువాయి) అత్యవసర సేవే అని చెప్పారు. కాబట్టి టికెట్ ధరల్లో భారీ పెరుగుదల రాజ్యాంగంలోని 14 అధీకరణను (సమానత్వ హక్కు) ఉల్లంఘిస్తోందని చెప్పే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో జస్టిస్ విక్రమ్ నాథ్ నాయకత్వంలోని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. అలాంటప్పుడు విమాన ప్రయాణాలు చేయొద్దని స్పష్టం చేసింది. మరోమాటకు తావు లేకుండా మరో కేసుపై దృష్టిసారించింది. టికెట్ ధరల నియంత్రణకు సంబంధించి భారతీయ వాయుయాన్ అధినియమ్-2026 పేరిట ఇటీవల కేంద్రం కొత్త నిబంధనలు తీసుకొచ్చిన విషయం తెలిసిందే. వచ్చే ఏడాది జనవరి 1 నుంచీ ఇవి అమల్లోకి రానున్నాయి. అత్యవసర సందర్భాల్లో మాత్రమే కేంద్రం ధరల నియంత్రణకు ఉపక్రమించేలా ఈ నిబంధనలను



రూపొందించారు. మిగతా సందర్భాల్లో ధరలను మార్కెట్ పరిస్థితులకు వదిలిపెట్టేందుకు కేంద్రం నిర్ణయించింది. ఇంధన ధరలు పెరుగుతున్న నేపథ్యంలో టికెట్ ధరలు పెంచక తప్పదని ఇండిగో ఎయిర్‌లైన్స్ సంస్థ సీఈఓ విల్లీ వాల్ష్ ఇటీవల పేర్కొన్న విషయం తెలిసిందే. రూపాయి మారకం విలువ తగ్గడం, ఇంధన ఖర్చులు పెరగడం తమకు భారంగా మారాయని ఆయన అన్నారు. ధరలు పెంచడం మినహా తమకు మరో మార్గం లేదని అన్నారు. అయితే, విమానయానం అందరికీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఇక సెప్టెంబర్ త్రైమాసికంలో ఇండిగో ఎయిర్‌లైన్స్ రూ.1897 కోట్ల నష్టాలను చవి చూసింది.

తెలంగాణలో కాంగ్రెస్‌ను కూకటివేళ్లతో పెకిలిస్తాం..!!

(మొదటిపేజి తరువాయి) జీవితంలో రాహుల్ ప్రధాని కాలేరని, మాక్ పార్లమెంట్‌లో ప్రధాని సీట్‌లో కూర్చొని సంబరపడాల్సిందేనని ఎద్దేవా చేశారు. తాము సర్‌పై చర్చించేందుకు సిద్ధమని కాంగ్రెస్ పార్టీకి సవాలు విసిరారు.

ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారు... ఈవీఎంలతోనే కేంద్రంలో బీజేపీ గెలిచిందనుకుంటే, తెలంగాణలో రేవంత్ ఎలా గెలిచారని అమిత్ షా ప్రశ్నించారు. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఎంత ప్రయత్నించినా చొరబాటుదారులకు ఓటు దక్కనివ్వబోమని నొక్కి చెప్పారు. 'ప్రస్తుతం దేశవ్యాప్తంగా కాంగ్రెస్ వెంటిలేటర్‌పై ఉంది. అలాంటి పార్టీ మోదీని అడ్డుకుంటుందా? కాంగ్రెస్‌ను రాహుల్ గాంధీ కాపాడలేరు'అని పేర్కొన్నారు. 'తెలంగాణలో ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారు. ఆర్ఆర్ అంటే రేవంత్ టూ రాహుల్ ట్యాక్స్, రాహుల్‌కు రేవంత్ కప్పం కడుతున్నారు' అని అమిత్ షా ఆరోపించారు. తెలంగాణలో 6 గ్యారెంటీలు అమలు కావట్లేదని ఆయన విమర్శించారు.

టికెట్ ధరలు ఎక్కువగా ఉంటే విమానాల్లో వెళ్లొద్దు: సుప్రీం కోర్టు

(మొదటిపేజి తరువాయి) మరోమాటకు తావు లేకుండా మరో కేసుపై దృష్టిసారించింది. టికెట్ ధరల నియంత్రణకు సంబంధించి భారతీయ వాయుయాన్ అధినియమ్-2026 పేరిట ఇటీవల కేంద్రం కొత్త నిబంధనలు తీసుకొచ్చిన విషయం తెలిసిందే. వచ్చే ఏడాది జనవరి 1 నుంచీ ఇవి అమల్లోకి రానున్నాయి. అత్యవసర సందర్భాల్లో మాత్రమే కేంద్రం ధరల నియంత్రణకు ఉపక్రమించేలా ఈ నిబంధనలను రూపొందించారు. మిగతా సందర్భాల్లో ధరలను మార్కెట్ పరిస్థితులకు వదిలిపెట్టేందుకు కేంద్రం నిర్ణయించింది. ఇంధన ధరలు పెరుగుతున్న నేపథ్యంలో టికెట్ ధరలు పెంచక తప్పదని ఇండిగో ఎయిర్‌లైన్స్ సంస్థ సీఈఓ విల్లీ వాల్ష్ ఇటీవల పేర్కొన్న విషయం తెలిసిందే. రూపాయి మారకం విలువ తగ్గడం, ఇంధన ఖర్చులు పెరగడం తమకు భారంగా మారాయని ఆయన అన్నారు. ధరలు పెంచడం మినహా తమకు మరో మార్గం లేదని అన్నారు. అయితే, విమానయానం అందరికీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఇక సెప్టెంబర్ త్రైమాసికంలో ఇండిగో ఎయిర్‌లైన్స్ రూ.1897 కోట్ల నష్టాలను చవి చూసింది.

మురసు తీవ్ర తుపాను..

సహాయక చర్యలకు రూ.37 కోట్లు విడుదల

(మొదటిపేజి తరువాయి) ముంపు ప్రాంత బాధితుల తరలింపు, తాగునీటి సరఫరా, ఆహారం, పాలు, ఆరోగ్య శిబిరాలు, పారిశుద్ధ్యం, రోడ్లు, ఇరిగేషన్ కోసం అత్యవసర రిపేర్లు, విద్యుత్ ప్రత్యామ్నాయ జనరేటర్లు, కొవ్వొత్తుల వంటివాటి సరఫరా కోసం ఈ నిధులను వినియోగించాలని జిల్లాల కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

తితిదేకు స్పెసిఫైడ్ అథారిటీ నియామకం

తిరుపతి : తితిదే ట్రస్టు బోర్డు పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం 'స్పెసిఫైడ్ అథారిటీ'ని నియమించింది. ఈ మేరకు జీవో నం. 658 విడుదల చేసింది. తితిదే ఈవో



ముద్దాడ రవిచంద్ర ఛైర్మన్‌గా.. ఆర్థికశాఖ కార్యదర్శి వి. వినయ్ చంద్, దేవాదాయ శాఖ కార్యదర్శి కె. కన్నబాబు సభ్యులుగా అథారిటీని ఏర్పాటు చేసింది. నూతన ట్రస్ట్ బోర్డు ఏర్పాటయ్యే వరకు లేదా ఏడాది పాటు ఈ స్పెసిఫైడ్ అథారిటీ కొనసాగనుంది. తితిదే ధర్మకర్తల మండలికి ఉండే అన్ని అధికారాలూ దీనికి ఉంటాయి.

ఏపీ మద్యం కుంభకోణం.. రాజ్ కెసిరెడ్డి ప్రధాన అనుచరుడు అరెస్టు

విజయవాడ: ఏపీ మద్యం కుంభకోణం కేసులో కీలక నిందితుడు రాజ్ కెసిరెడ్డి ప్రధాన అనుచరుడు ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డిని ఈడీ అరెస్టు చేసింది. విజయవాడ జైలులో ఉన్న



అతడిని పీటీ వారెంట్‌పై ఈడీ నాంపల్లి కోర్టులో హాజరుపరిచింది. విచారణ చేపట్టిన న్యాయస్థానం ఈ నెల 16 వరకు రిమాండ్ విధించింది. మరోవైపు ఈశ్వర్‌ను రెండ్రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని ఈడీ పిటిషన్ దాఖలు చేసింది. అతడిని విచారిస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని ఈడీ భావిస్తోంది. వైద్య పరీక్షల అనంతరం మరికాసేపట్లో అధికారులు అతడిని చంచల్‌గూడ జైలుకు తరలించనున్నారు.

త్వరితగతిన రాష్ట్రానికి సాయం అందించండి..

కేంద్రానికి చంద్రబాబు విజ్ఞప్తి

అమరావతి : ఆర్నబ్ తుఫాన్ కారణంగా జరిగిన నష్టాన్ని అంచనా వేయడానికి కేంద్రం నుంచి వచ్చిన బృందంతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడారు. తుఫాన్ వల్ల ఏపీకి ప్రాథమికంగా రూ.4526 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ఆ బృందం వెల్లడించింది. దీంతో కేంద్రం త్వరితగతిన రాష్ట్రానికి సాయం అందించాలని సీఎం కోరారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తుఫాను నష్టానికి సంబంధించిన ప్రాథమిక నివేదికను కేంద్రానికి పంపించామని వెల్లడించారు. త్వరితగతిన రాష్ట్రానికి కలిగిన నష్టం



అంచనా వేసిన కేంద్ర బృందానికి ధన్యవాదాలు తెలియజేశారు. 'ఆర్నబ్ కారణంగా వ్యవసాయ పంటలు, కొబ్బరి, అరటి లాంటి పంటలు దెబ్బతిన్నాయి. ఆర్నబ్ మిగిల్చిన నష్టాన్ని ఇంకా పూడ్చుకోకముందే మురసు తుఫాను రాష్ట్రాన్ని తాకుతోంది. ప్రస్తుతం ఏపీలోని కొన్ని ప్రాంతాలు ఎల్‌నినో లాంటి తీవ్ర కరువును, మరికొన్ని ప్రాంతాలు తుఫాన్ల ముప్పును ఎదుర్కొంటున్నాయి' అని చంద్రబాబు పేర్కొన్నారు. ఆర్నబ్ నష్టాన్ని సీఎం వివరిస్తూ.. ఈ తుఫాన్ ప్రభావం ఉద్యాన, ఆక్వాకల్చర్ లాంటి వాణిజ్య పంటలుపైనా పడిందని అన్నారు. 'ఆర్నబ్ కారణంగా విద్యుత్, రహదారులు లాంటి మౌలిక సదుపాయాలూ దెబ్బతిన్నాయి. మత్స్యకారుల పడవలు కూడా ధ్వంసమయ్యాయి. అయితే రియల్ టైమ్ గవర్నెన్స్‌తో పాటు వివిధ టెక్నాలజీల అనుసంధానంతో ప్రాణనష్టాన్ని భారీగా తగ్గించాం. పునరావాసం, సహాయక చర్యలను ఆర్టీజీఎస్ ద్వారా పర్యవేక్షించాం. విద్యుత్ పునరుద్ధరణకు 7 వేల మందితో యుద్ధ ప్రాతిపదికన పనిచేస్తున్నాం' అని ఆయన తెలిపారు. కేంద్ర బృందం త్వరితగతిన సిఫార్సులు చేసి నష్టాన్ని భర్తీ చేసేలా సహకరించాలని కోరారు. కేంద్రం చేసే సత్వర సాయం రాష్ట్రానికి పెద్ద ఊరట ఇస్తుందని చెప్పారు.

ఈడీ మెరుపు దాడులు.. రూ.1,500 కోట్ల మనీలాండరింగ్ గుట్టురట్టు

దిల్లీ: విశాఖపట్నం సబ్ జోనల్ కార్యాలయం ఆధ్వర్యంలో దిల్లీ, కోల్‌కతాలోని 7 ప్రాంతాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ




దాడుల్లో రూ.1,500 కోట్ల మనీలాండరింగ్ గుట్టు రట్టయింది. కస్టమైజ్డ్ సాఫ్ట్‌వేర్ దిగుమతుల పేరుతో విదేశాలకు అక్రమంగా నిధులు తరలించినట్లు ఈడీ గుర్తించింది. నకిలీ పత్రాలు, ఫోర్జరీ ఇన్వాయిస్‌లతో బ్యాంకుల ద్వారా నగదు బదిలీ అయినట్లు సమాచారం. వడ్డీ మహేశ్, అతడి తండ్రి, మరికొందరు కలిసి కోల్‌కతాలో పలు షెల్ కంపెనీలు ఏర్పాటు చేసినట్లు ఈడీ గుర్తించింది. వాటి ద్వారా సింగపూర్, హాంకాంగ్, చైనాలోని ఐదు కంపెనీలకు రూ.569.03 కోట్లు బదిలీ చేసినట్లు గుర్తించింది. 2014-2017 మధ్య షెల్ కంపెనీల బ్యాంకు ఖాతాల ద్వారా విదేశాలకు నిధుల మళ్లించినట్లు తేల్చింది. ఈ కేసులో సుమారు రూ.1,500 కోట్ల నేరపూరిత లావాదేవీలు జరిగినట్లు ఈడీ ప్రాథమికంగా అంచనా వేస్తోంది. సోదాల్లో భాగంగా లెక్క చూపని రూ.47 లక్షల నగదును ఈడీ స్వాధీనం చేసుకుంది. దీంతోపాటు 5,900 అమెరికన్ డాలర్లు, 2,200 యూఏఈ దిర్హామ్‌లు, 5,600 చైనా కరెన్సీ, కీలక డాక్యుమెంట్లు, ఆస్తి పత్రాలు, డిజిటల్ పరికరాలను ఈడీ సీజ్ చేసింది.

ఏపీకి హైఅలెర్ట్.. ఈ రాత్రికే తీరం దాటనున్న తుఫాన్..

ఈ జిల్లాల్లో కుండపోత వర్షాలు

ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర తుపాను ముప్పు ముంచుకొచ్చింది. బంగాళాఖాతంలో తీవ్ర రూపం దాల్చిన మురసు ఒంగోలు దిశగా వేగంగా కదులుతోంది. మరికొద్ది గంటల్లోనే తీరం దాటనుండటంతో ప్రకాశం, బాపట్ల, నెల్లూరు సహా పలు జిల్లాల్లో పెనుగాలులతో కూడిన అతిభారీ వర్షాలు దంచికొట్టనున్నాయి. అధికారులు అత్యవసర హెచ్చరికలు జారీ చేయడంతో తీరప్రాంతం వణికిపోతోంది.

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న మురసు తీవ్ర తుపాను శరవేగంగా ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకొస్తోంది. గడచిన 6 గంటల్లో గంటకు 12 కిలోమీటర్ల వేగంతో పయనిస్తున్న ఈ తీవ్ర తుపాను, సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము మధ్య ఒంగోలు సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ, ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించాయి. సోమవారం సాయంత్రం 6 గంటల సమయానికి అందిన సమాచారం ప్రకారం.. మురసు తీవ్ర తుపాను ప్రస్తుతం నెల్లూరుకు కేవలం 80 కిలోమీటర్లు, కావలికి 90 కిలోమీటర్లు, ఒంగోలుకు 120 కిలోమీటర్లు, బాపట్లకు 150 కిలోమీటర్లు, తిరుపతికి 160 కిలోమీటర్లు, మచిలీపట్నానికి 190 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై



ఉంది. ఇది తీరానికి సమీపిస్తున్న కొద్దీ సముద్రం తీవ్రంగా అల్లకల్లోలంగా మారింది.

గంటకు 120 కి.మీ వేగంతో పెనుగాలులు.. కుండపోత వర్షాలు

తుపాను ప్రభావంతో పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు జిల్లాల్లో అక్కడక్కడా భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. తీవ్ర తుపాను తీరం దాటే సమయంలో తీరం వెంబడి గంటకు 100 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీస్తాయని అధికారులు తెలిపారు. బలమైన ఈదురుగాలుల ధాటికి చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలమట్టమయ్యే ముప్పు ఉండటంతో విద్యుత్,రవాణా శాఖలను ఇప్పటికే అప్రమత్తం చేశారు.

ప్రజలు ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలి: ప్రఖర్ జైన్ తుపాను ముప్పు నేపథ్యంలో తీరప్రాంత ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఎన్డీఎంఏ మేనేజింగ్ డైరెక్టర్, ఆర్టీజీఎస్ సీఈఓ ప్రఖర్ జైన్ విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా తుపాను తీరం దాటే కీలక సమయంలో ప్రజలెవరూ బయటకు రావద్దని, పక్కా భవనాలు లేదా ప్రభుత్వ సహాయ పునరావాస కేంద్రాల్లోనే సురక్షితంగా ఉండాలని సూచించా రు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని, లోతట్టు ప్రాం తాల ప్రజలు అధికారుల సూచనలను పాటిస్తూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు ఇప్పటికే ప్రభావిత జిల్లాల్లో రంగంలోకి దిగి సహాయక చర్యలకు సిద్ధంగా ఉన్నాయి.

సంపాదకీయం

చార్మినార్ భాగ్య లక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న అమిత్ షా

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సోమవారం రోజు హైదరాబాద్ పర్యాటనలో భాగంగా భాగ్యలక్ష్మీ అమ్మవారిని సందర్శించుకున్నారు. అమిత్ షా పర్యాటన రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపింది. బేగంపేట విమానాశ్రయంలో దిగిన ఆయనకు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి సహా కమలం పార్టీ ముఖ్య నేతలు సాదరంగా ఆహ్వానం పలికారు.





కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సోమవారం రోజు హైదరాబాద్ పర్యాటనలో భాగంగా భాగ్యలక్ష్మీ అమ్మవారిని సందర్శించుకున్నారు. అమిత్ షా పర్యాటన రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపింది. బేగంపేట విమానాశ్రయంలో దిగిన ఆయనకు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి సహా కమలం పార్టీ ముఖ్య నేతలు సాదరంగా ఆహ్వానం పలికారు. ఎయిర్‌పోర్ట్ నుంచి నేరుగా పాతబస్తీ చేరుకున్న హోంమంత్రి, చారిత్రక చార్మినార్ చెంత వెలసిన శ్రీ భాగ్యలక్ష్మి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. వీఐపీ పర్యటన నేపథ్యంలో పాతబస్తీలో పోలీసులు భారీ ఎత్తున నిఘా పెంచి భద్రతను పర్యవేక్షించారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆయన కాకతీయ హోటల్‌కు చేరుకుని కొంత సమయం గడిపారు. ఇక భాగ్య లక్ష్మీ అమ్మవారిని దర్శించుకున్న అనంతరం, అమిత్ షా హైదరాబాద్‌లోని శ్రీ భాగ్యలక్ష్మి ఆలయంలో అమ్మవారికి పూజలు చేయడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ప్రజలందరూ సుఖశాంతులు, సిరిసంపదలతో ఎల్లప్పుడూ వర్ధిల్లాలని ఆ లక్ష్మీదేవిని మనసారా ప్రార్థించాను. అంటూ ట్వీట్ చేశారు. పర్యటన మొదట్లోనే కాంగ్రెస్ లక్ష్యంగా అమిత్ షా సామాజిక మాధ్యమం 'ఎక్స్' (ట్విట్టర్) లో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో వరుస పరాజయాలను జీర్ణించుకోలేక, హింసాత్మక లేదా అరాచక మార్గాల ద్వారా ప్రజాస్వామ్యాన్ని అణచివేసి అధికారంలోకి రావాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఈ తరహా కుట్రలను తిప్పికొట్టి రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసమే తాను నగరంలో గళమెత్తుతున్నట్లు పేర్కొన్నారు. షెడ్యూల్ ప్రకారం.. సాయంత్రం 4 గంటలకు నిజాం కళాశాల సమీపంలోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించి.. ప్రజాస్వామ్య పరిరక్షణ - అరాచక నిర్మూలన అనే నినాదంతో భారీ ర్యాలీగా మొజాంజాహీ మార్కెట్ వరకు పాదయాత్ర చేపడతారు. ఎంజే మార్కెట్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన సభలో అమిత్ షా కీలక ప్రసంగం చేస్తారు. ఇక్కడి నుంచే బీజేపీ శ్రేణులకు రాజకీయ దిశానిర్దేశం చేయనున్నారు. బహిరంగ కార్యక్రమం ముగియగానే ఆయన ప్రత్యేక విమానంలో హస్తినకు తిరుగుపయనం కానున్నారు. హోంమంత్రి రాకను పురస్కరించుకుని నగర పోలీస్ శాఖ భారీగా బలగాలను మోహరించి, ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టింది.

భారత 29వ వైమానిక దళాధిపతిగా బాధ్యతలు చేపట్టిన

ఎయిర్ చీఫ్ మార్షల్ అశుతోష్ దీక్షిత్

భారత వైమానిక దళ 29వ అధిపతిగా ఎయిర్ చీఫ్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ బాధ్యతలు స్వీకరించారు. భారత వాయుసేనను ఆధునీకరించడం, పోరాట సంసిద్ధతను మెరుగుపరచడం, స్వదేశీ రక్షణ సామర్థ్యాలను పెంపొందించడంపై ఆయన దృష్టి సారించనున్నారు. 40 ఏళ్లకు పైగా విశిష్ట సేవలందించిన దీక్షిత్, మిరాజ్-2000, తేజస్ వంటి విమానాల ఆధునీకరణలో కీలక పాత్ర పోషించారు. ఇక తాజాగా ఆయన్ను కలిసిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ దీక్షిత్‌ను అభినందించారు.



భారత 29వ వైమానిక దళాధిపతిగా ఎయిర్ చీఫ్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ బాధ్యతలు చేపట్టారు. దేశానికి 42 సంవత్సరాల పాటు విశిష్ట సేవలందించిన ఎయిర్ చీఫ్ మార్షల్ ఎపి సింగ్ స్థానంలో అశుతోష్ దీక్షిత్ నియమితులయ్యారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కొత్తగా నియమితులైన ఎయిర్ చీఫ్ మార్షల్ అశుతోష్ ను కలిసి అభినందించారు. అశుతోష్ దీక్షిత్ పదవీకాలం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. వాయుసేనకి అద్భుతమైన నాయకత్వానికి పేరుగాంచిన ఒక విశిష్ట వాయు యోధుడుగా అశుతోష్ దీక్షిత్ ను కొనియాడారు. భారత వాయుసేన పోరాట సంసిద్ధత, వాయుసేన సామర్థ్యాన్ని పునరుద్ధరించడం, స్వదేశీ రక్షణ సామర్థ్యాలు, సాంకేతిక ఆవిష్కరణలు సాయుధ దళాల మధ్య సమన్వయం వంటి అంశాలపై దృష్టి సారిస్తానని అశుతోష్ దీక్షిత్ స్పష్టం చేశారు

ఎవరీ అశుతోష్ దీక్షిత్..?... నేషనల్ డిఫెన్స్ అకాడమీ పూర్వ విద్యార్థి అయిన ఎయిర్ చీఫ్ మార్షల్ అశుతోష్ దీక్షిత్, 1986 డిసెంబర్ 6న భారత వైమానిక దళంలోని ఫైటర్ స్ట్రీమ్‌లోకి నియమితులయ్యారు. నాలుగు దశాబ్దాల పాటు సాగిన తన కెరీర్‌లో, ఎయిర్ చీఫ్ ఆపరేషన్స్, ఫ్లైట్ టెస్టింగ్, సామర్థ్య అభివృద్ధి జాయింట్ స్టాఫ్ అసైన్మెంట్లు వంటి విభిన్న రంగాలలో విస్తారమైన అనుభవం ఉంది. ఆయన నిష్ణాతుడైన ఫైటర్ పైలట్, అర్హత కలిగిన ఫ్లయింగ్ ఇన్స్ట్రక్టర్ , ప్రయోగాత్మక టెస్ట్ పైలట్ అయిన ఆయనకు, మిరాజ్-2000, వివిధ మిగ్ వేరియంట్లు, జాగ్వార్ అనేక రవాణా విమానాలతో సహా విస్తృత శ్రేణి విమానాలలో 3,300 గంటలకు పైగా విమానయాన అనుభవం ఉంది. భారత వైమానిక దళ ఆధునీకరణకు ఆయన చేసిన కృషికి విస్తృతంగా గుర్తింపు పొందిన ఆయన, జాగ్వార్ , మిగ్-27 ఆధునీకరణ ప్రాజెక్టులను ఖరారు చేయడంలో, ఎల్సిఎ మార్క్-1 తేజస్ యొక్క ఇనీషియల్ ఆపరేషనల్ క్లియరెన్స్ (ఐఓసి) ఫైనల్ ఆపరేషనల్ క్లియరెన్స్ (ఎఫ్ఎసి) కార్యకలాపాలను పూర్తి చేయడంలో కీలక పాత్ర పోషించారు. అశుతోష్ దీక్షిత్ కార్యాచరణ కమాండ్ నియామకాలలో మిరాజ్ -- 2000 స్క్వాడ్రన్, పశ్చిమ సెక్టార్లోని ఫార్వర్డ్ బేస్ సపోర్ట్ యూనిట్ ఐఎఎఫ్ ,యొక్క ప్రధాన ఫైటర్ శిక్షణా స్థావరమైన బీదర్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్ కమాండ్ ఉన్నాయి. అశుతోష్ దీక్షిత్ ఎయిర్ ఆఫీసర్ సదరన్ ఎయిర్ కమాండ్లో ఎయిర్ డిఫెన్స్ కమాండర్ గా సౌత్ వెస్ట్రన్ ఎయిర్ కమాండ్లో సీనియర్ ఎయిర్ స్టాఫ్ ఆఫీసర్ గా , డిప్యూటీ చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్ గా పనిచేస్తూ, కీలక సామర్థ్య అభివృద్ధి కార్యక్రమాలకు సారథ్యం వహించారు. సెంట్రల్ ఎయిర్ కమాండ్ ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్గా బాధ్యతలు చేపట్టారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ చైర్మన్ కు చీఫ్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్ గా పనిచేశారు. చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్ గా బాధ్యతలు స్వీకరించడానికి ముందు, ఆయన వైస్ చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్ గా కూడా పనిచేశారు.అశుతోష్ దీక్షిత్ సైనిక సేవలకు గానూ పరమ విశిష్ట సేవా పతకం (2026), అతి విశిష్ట సేవా పతకం (2023), వాయు సేనా పతకం (2006), విశిష్ట సేవా పతకం (2011) పొందారు.

జిల్లేడు బండ రిజర్వాయర్‌తో...

23 వేల ఎకరాలకు సాగునీరు

ముగుబ్బ, నవంబరు 2, అమరావతి వెలుగు :స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ముదిగుబ్బ మండలంలో ఎన్డీఏ కూటమి అభ్యర్థుల తరపున రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, హిందూపురం ఎంపీ పార్థసారథి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ నుంచి ఎన్టీఆర్ కూడలి వరకు కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీ చేపట్టారు. మార్గమధ్యంలో ప్రజలను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జరిగిన ప్రచార సభలో మండల అభివృద్ధికి చేపట్టిన పనులు, భవిష్యత్తు ప్రణాళికలను మంత్రి వివరించారు. ముదిగుబ్బ పట్టణంతో పాటు మండలంలోని ప్రతి గ్రామానికి మౌలిక సదుపాయాలు కల్పించడం, రైతులకు సాగునీరు అందించడం, తాగునీటి సమస్యను పరిష్కరించడం, రహదారులు, వైద్య సదుపాయాలను మెరుగుపరచడమే లక్ష్యమని మంత్రి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. జిల్లేడు బండ రిజర్వాయర్‌ను పూర్తి చేసి సుమారు 23 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం సుమారు రూ.448.33 కోట్ల నిధులు కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. హెచ్ఎన్ఎస్ఎస్ కాలువల 14 కిలోమీటర్ల లైనింగ్ పనులకు రూ.41 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. మండలంలో గుంజేపల్లి వద్ద రూ.5 కోట్లతో విద్యుత్ ఉపకేంద్రం మంజూరు చేశామని, రూ.56.58 కోట్లతో విద్యుత్ ఫీడర్ల అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ల పంపిణీ, పాత విద్యుత్ స్తంభాల మార్పు పనులు జరుగుతున్నాయన్నారు. జల్ జీవన్ మిషన్ కింద 174 పనులకు రూ.13.63 కోట్లు, రెండో విడతలో 88 పనులకు రూ.14.58 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ముదిగుబ్బ--దొరిగల్లు, మల్లేపల్లి--పి.కొట్టాల, మలకవేముల--పి.కొట్టాల రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేశామని, పల్లె పండుగ కార్యక్రమం కింద రూ.4 కోట్లతో పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. ముదిగుబ్బ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధునికీకరణకు రూ.1.69 కోట్లు మంజూరు చేయగా, రూ.50 లక్షలతో బ్లాక్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం పూర్తయిందన్నారు. పాఠశాలల మరమ్మతులు, విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ, పరీక్ష ఫీజుల సహాయం, పశువుల ఆసుపత్రులకు నూతన భవనాలు, మొబైల్ టవర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం వంటి కార్యక్రమాలను వివరించారు. ముదిగుబ్బ మండల అభివృద్ధిని కొనసాగించేందుకు ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు ప్రజలు మద్దతు ఇవ్వాలని మంత్రి కోరారు. జెడ్పీటీసీ టీజేపీ అభ్యర్థి గొడ్డుమర్రి అదినారాయణ యాదవ్, ముదిగుబ్బ-1 ఎంపీటీసీ టీడీపీ అభ్యర్థి తుమ్మల నాయుడుతో పాటు కూటమి అభ్యర్థులందరినీ సైకిల్, కమలం గుర్తులపై ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో స్థానిక ఎన్డీఏ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బత్తలపల్లి అభివృద్ధికి ఎన్డీఏ అభ్యర్థులకు

మద్దతివ్వండి

బత్తలపల్లి, నవంబరు2, అమరావతి వెలుగు : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బత్తలపల్లి మండలంలో ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు మద్దతుగా రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జడ్పీటీసీ అభ్యర్థి జక్కంపూటి స్వరూప, ఎంపీటీసీ-1 అభ్యర్థి పోతక్క, ఎంపీటీసీ-2 అభ్యర్థి మౌనికతో కలిసి మండల కేంద్రంలో ప్రజలను కలుసుకుని ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బత్తలపల్లి మండల సమగ్ర అభివృద్ధికి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల పాత్ర కీలకమని తెలిపారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, స్థానిక సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు ప్రజాప్రతినిధులు బాధ్యతతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని, గ్రామాల అవసరాలను గుర్తించి అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కూటమి అభ్యర్థులకు సూచించారు. జక్కంపూటి స్వరూప, పోతక్క, మౌనికలకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో స్థానిక ఎన్డీఏ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రుద్రంపేటలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విస్తృత ప్రచారం

అనంతపురం రూరల్, నవంబరు 2, అమరావతి వెలుగు :స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అనంతపురం నియోజకవర్గ పరిధిలోని రుద్రంపేట పంచాయతీలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన చేపట్టిన రోడ్‌షోకు కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజల నుంచి స్పందన లభించింది. రుద్రంపేట బైపాస్ నుంచి ప్రారంభమైన ర్యాలీ చంద్రబాబునగర్ మీదుగా ఎంపీటీసీ-3 పరిధిలోని నిర్మల ఫరూక్‌నగర్, పంతుల కాలనీ, ఎంపీటీసీ-4 పరిధిలోని డిష్‌రూమ్ రెండో ఆటోస్టాండ్ వరకు సాగింది. పలుచోట్ల ఎమ్మెల్యేకు గజమాలలతో స్వాగతం పలికారు. రుద్రంపేట ఎంపీటీసీ-2 స్థానం ఏకగ్రీవం కాగా, ఎంపీటీసీ-1 అభ్యర్థి రామాంజినమ్మ, ఎంపీటీసీ-3 అభ్యర్థి సాకే అంజి, ఎంపీటీసీ-4 అభ్యర్థి రాజేశ్వరికి మద్దతుగా ఎమ్మెల్యే ప్రచారం చేశారు. అనంతపురం రూరల్ జడ్పీటీసీ అభ్యర్థి మాధవితో పాటు ఎంపీటీసీ అభ్యర్థులు ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ సహకారంతో పంచాయతీల అభివృద్ధికి నిధులు తీసుకొచ్చి పలు పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహకారంతో గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, మురుగు కాలువల నిర్మాణానికి ప్రాధాన్యం ఇచ్చామన్నారు. రుద్రంపేట పంచాయతీ పరిధిలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రహదారి సమస్యలకు పరిష్కారం చూపినట్లు పేర్కొన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యమైందని, గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులు ఇతర అవసరాలకు మళ్లించడంతో అభివృద్ధి పనులు కుంటుపడ్డాయని ఎమ్మెల్యే విమర్శించారు. గ్రామాల స్వయం సమృద్ధి, నిరంతర అభివృద్ధి కోసం కూటమి బలపరిచిన జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులకు మద్దతు తెలిపి గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



రాష్ట్రంలో పదివేల ఎకరాల్లో...

ఔషధ మొక్కల సాగుకు ప్రణాళిక

అనంతపురం/ పుట్టపర్తి, నవంబరు 02, అమరావతి వెలుగు : రాష్ట్రవ్యాప్తంగా పదివేల ఎకరాల్లో ఔషధ, సుగంధ మొక్కల సాగును ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యాచరణ







రూపొందిస్తున్నట్లు ఏపీ ఔషధ, సుగంధ మొక్కల బోర్డు ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆవుల చంద్రశేఖర్ తెలిపారు. ఇందులో భాగంగా అనంతపురం, శ్రీ సత్యసాయి, కర్నూలు జిల్లాలను మొదటి సమూహంగా, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, అనకాపల్లి జిల్లాలను రెండో సమూహంగా ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఔషధ మొక్కల సాగుకు అనువైన భూములు, నీటి లభ్యత తదితర అంశాలను పరిశీలించేందుకు సోమవారం అనంతపురం, పుట్టపర్తి జిల్లాల్లో ఆయన పర్యటించారు. అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్‌తో ఉదయం సమీక్ష సమావేశం నిర్వహించి ఔషధ మొక్కల సాగు విస్తరణపై చర్చించారు. అనంతరం పుట్టపర్తిలోని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ అధ్యక్షతన సమావేశం జరిగింది. జిల్లాలో ఔషధ మొక్కల సాగుకు అనువైన భూములను గుర్తించాలని, రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి సాగు చేపట్టేలా ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. శ్రీ సత్యసాయి జిల్లాలో మూడు వేల ఎకరాలు, అనంతపురం జిల్లాలో మూడున్నర వేల ఎకరాల్లో సాగుకు అవసరమైన భూములను సిద్ధం చేయాలని వంటి ఔషధ మొక్కల సాగును ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను సమన్వయం చేసుకుంటూ సాగు విస్తీర్ణాన్ని పెంచడంతోపాటు పంటలకు మార్కెటింగ్ సౌకర్యాలు, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి అవసరమైన ఏర్పాట్లు చేస్తామన్నారు. వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి వీరపాండ్యన్, సంయుక్త కార్యదర్శి, ఆయుష్ సంచాలకులు రోణంకి గోపాలకృష్ణ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమంపై విస్తృతంగా అధ్యయనం చేస్తున్నట్లు వివరించారు. విద్యార్థుల్లో పోషకాహార లోపాలను నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పోషణ వాటిక కార్యక్రమం మంచి ఫలితాలను అందిస్తోందని పేర్కొన్నారు. పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఇళ్ల ప్రాంగణాల్లో పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, ఔషధ మొక్కలను సేంద్రియ పద్ధతుల్లో పెంచడం ద్వారా పోషకాహార భద్రత సాధ్యమవుతుందన్నారు. తులసి, కలబంద వంటి ఔషధ మొక్కల పెంపకంతో ఆరోగ్య పరిరక్షణకు కూడా తోడ్పాటు లభిస్తుందని తెలిపారు. ముఖ్యంగా మహిళలు, పిల్లల్లో విటమిన్లు, ఖనిజ లవణాల లోపాలను తగ్గించేందుకు పోషణ వాటికలు ఉపయోగపడతాయని చెప్పారు. తక్కువ ఖర్చుతో ప్రకృతి సిద్ధమైన ఎరువులను వినియోగిస్తూ తాజా, రసాయన రహిత ఆహార ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురావచ్చన్నారు. గురుకుల పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల ప్రాంగణాల్లో పోషకాహార, ఔషధ మొక్కల పెంపకానికి అవసరమైన నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఉమ్మడి అనంతపురం జిల్లా అటవీశాఖ అధికారిగా పనిచేసిన అనుబంధాన్ని గుర్తుచేసుకున్న ఆయన, ఈ ప్రాంత అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. ఇటీవల లండన్‌లోని బ్రిటన్ పార్లమెంటు ప్రాంగణంలో ప్రపంచ రికార్డుల సంస్థ నుంచి అంతర్జాతీయ పురస్కారం అందుకున్న ఆవుల చంద్రశేఖర్‌ను ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో శ్రీ సత్యసాయి జిల్లా అటవీశాఖ అధికారి చక్రపాణి, డివిజనల్ అటవీశాఖ అధికారి శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి కృష్ణయ్య, ఉద్యానవనశాఖ ఉపసంచాలకులు కె. జయకుమార్ బాబు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ విజయప్రసాద్, పట్టు పరిశ్రమ శాఖ సంయుక్త సంచాలకులు శోభారాణి, అనంతపురం జిల్లా ఉద్యానశాఖ అధికారి ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పరిటాల శ్రీరామ్ విజయానికి ఎమ్మెల్సీ

వడ్డే దళవాయి రమాదేవి విస్తృత ప్రచారం

నల్లచెరువు , నవంబరు 02, అమరావతి వెలుగు : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నల్లచెరువు మండలంలో కూటమి జడ్పీటీసీ అభ్యర్థి పరిటాల శ్రీరామ్‌కు మద్దతుగా ఎమ్మెల్సీ వడ్డే దళవాయి రమాదేవి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర టీసీ సెల్ అధికార ప్రతినిధి దళవాయి వెంకటనారాయణతో కలిసి మండల పరిధిలోని చెవిటివారిపల్లి, నడింపల్లి, సుబ్బరాయనపల్లి, పంతలచెరువు, ఉచిచర్ల, ఎర్రగుంట్లపల్లి, మద్దిమడుగు, తవళంమర్రి తదితర గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో ప్రజలను నేరుగా కలుసుకుని కూటమి అభ్యర్థులకు మద్దతు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వడ్డే దళవాయి రమాదేవి మాట్లాడుతూ నల్లచెరువు మండల సమగ్ర అభివృద్ధికి పరిటాల శ్రీరామ్ కృషి చేస్తారని తెలిపారు. జడ్పీటీసీ ఎన్నికల్లో పరిటాల శ్రీరామ్‌కు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు.





గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేసే నాయకత్వానికి మద్దతు ఇవ్వాలని కోరారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్య, వైద్య సదుపాయాల మెరుగుదలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికీ చేరేలా ప్రజాప్రతినిధులు బాధ్యతతో పనిచేయాలని పేర్కొన్నారు. ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ప్రజలు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో శ్రీ సత్యసాయి జిల్లా వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేపల్లి ఉత్తన్న, సంఘం గౌరవాధ్యక్షుడు, సీనియర్ టీడీపీ నాయకుడు వల్లిపి గంగులప్ప (ఎర్రవంకపల్లి), కదిరి తాలూకా వడ్డెర సంఘం అధ్యక్షులు డాబా గంగయ్య, ఇడగొట్టు ఆనంద్,తదితరులు పాల్గొన్నారు. అలాగే టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వడ్డెర సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని పరిటాల శ్రీరామ్ విజయానికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు.

కరువు నష్టాలను పరిశీలించిన కేంద్ర బృందం

అనంతపురం / ఆత్మకూరు :
, నవంబరు 02, అమరావతి వెలుగు :







జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులు, పంట నష్టాలను అంచనా వేసేందుకు కేంద్ర కరువు బృందం సోమవారం ఆత్మకూరు మండలంలో క్షేత్రస్థాయిలో పర్యటించింది. పంపనూరు గ్రామంలో కంది పంటను పరిశీలించి రైతులతో మాట్లాడింది. అనంతరం రైతు సేవా కేంద్రంలో ముఖాముఖి నిర్వహించి పంటల సాగు, వర్షాభావం, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుంది. ఈ పర్యటనలో కేంద్ర బృందం నాయకుడు, వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి చిన్మయ్ గోట్మారే, సభ్యులు ప్రభా కాంతి, వినోద్ సమంత్, పంకజ్ పహాడియా, రాష్ట్ర నోడల్ అధికారి, వ్యవసాయ సంచాలకుడు మనజీర్ జీలానీ సమూన్, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. పంపనూరు గ్రామంలో రైతు నాగన్నకు చెందిన రెండు ఎకరాల కంది పంటను బృందం పరిశీలించింది. జూన్ 15న పంట సాగు చేశానని, వర్షాలు లేక పూర్తిగా నష్టపోయానని, ఎకరాకు రూ.15 వేల వరకు పెట్టుబడి పెట్టినట్లు రైతు వివరించారు. అనంతరం రైతు సేవా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మండల వ్యవసాయాధికారి పంటల సాగు విస్తీర్ణం, నష్టం వివరాలను వెల్లడించారు. ఎల్‌నినో ప్రభావంతో 80 శాతానికి పైగా పంట నష్టం జరిగినట్లు తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది సాగు విస్తీర్ణం ఎంత తగ్గిందని కేంద్ర బృందం సభ్యులు ఆరా తీశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వర్షాభావంతో పంటలు నష్టపోయిన తమను ఆదుకోవాలని కోరారు. ఉపాధి హామీ పనులను మరో 50 రోజులు పొడిగించాలని, రైతు కూలీలు, స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. బ్యాంకు రుణాల చెల్లింపుల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, తాగునీటి సమస్యను పరిష్కరించాలని, పశువులకు మేత అందించాలని కోరారు. కేంద్ర బృందం సాయం అందించేందుకు వచ్చిందని, రైతులకు తప్పకుండా అండగా ఉంటామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన బృందం చిన్నారుల తల్లులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంది. నిత్యావసర వస్తువుల ధరలు, బియ్యం, నూనె ధరలు పెరగడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని మహిళలు వివరించారు. ఆత్మకూరు పరిధిలో రైతు హరికృష్ణ నాయక్‌కు చెందిన ఆముదం పంటను కూడా బృందం పరిశీలించింది. మూడు ఎకరాల్లో సాగు చేసిన పంటకు ప్రస్తుతం 50 కిలోల దిగుబడి మాత్రమే వచ్చిందని, వర్షాలు లేక తీవ్రంగా నష్టపోయానని రైతు తెలిపారు. బోర్లు 600 నుంచి 700 అడుగుల లోతు వేసినా నీరు పడటం లేదని పలువురు రైతులు తమ ఇబ్బందులను వివరించారు. ఆత్మకూరు మండల కేంద్రంలోని ఎంపీఎఫ్‌సీ గోదాములో గొర్రెల పెంపకందారులు, పాడి రైతులతో కేంద్ర బృందం సమావే





శమైంది. గొర్రెలకు అడవుల్లోనూ మేత, నీరు లభించడం లేదని పెంపకందారులు తెలిపారు. పాడి పశువులకు వరిగడ్డి, దాణా ధరలు భారీగా పెరిగాయని, పాల ధరలు మాత్రం తగ్గాయని పాడి రైతులు వాపోయారు. పశువుల దాణాను సబ్సిడీపై అందించాలని, సైలేజ్, టీఎంఆర్ గడ్డిని సరఫరా చేయాలని, పచ్చగడ్డి సాగుకు సహకరించాలని కోరారు. పశువుల టీమా పథకాన్ని కొనసాగించాలని రైతులు విజ్ఞప్తి చేశారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా పెల్లిటైజేషన్ విధానంలో పంటలు సాగు చేస్తే పశువులకు మేత లభిస్తుందని కలెక్టర్ వివరించారు. పాస్‌బుక్ నిబంధన లేకుండా సహకార బ్యాంకుల ద్వారా రుణాలు అందించేలా చూడాలని పీఏసీఎస్ ఛైర్మన్ కృష్ణమోహన్ నాయుడు కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి సాలురెడ్డి, ఉద్యానశాఖ ఉప సంచాలకురాలు ఉమాదేవి, పశు సంవర్ధకశాఖ సంయుక్త సంచాలకుడు ప్రేమ్‌చంద్, ఏడీఏ వెంకటకుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై...

ఐర్లాండ్ ప్రముఖ వంటకళా నిపుణురాలు డారినా అలెన్ అధ్యయనం

మడకశిర , నవంబరు 02, అమరావతి వెలుగు : శ్రీ సత్యసాయి జిల్లాలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, పంటల వైవిధ్యం, వాటి పోషక విలువలు, రైతుల అనుభవాలను తెలుసుకునేందుకు ఐర్లాండ్‌కు చెందిన ప్రముఖ వంటకళా నిపుణురాలు డారినా అలెన్ జిల్లాలో పర్యటించారు. మడకశిర డివిజన్‌లోని పలు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి రైతులు సాగు చేస్తున్న వివిధ రకాల పంటలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యత, పోషక విలువలు, సహజ సాగు పద్ధతుల ప్రత్యేకతలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రతినిధి లక్ష్మానాయక్ అధ్వర్యంలో నిర్వహించిన ఈ క్షేత్రస్థాయి పర్యటనలో తొలుత జవనదకులో ప్రకృతి వ్యవసాయంలో వినియోగించే వివిధ రకాల సహజ ఎరువులు, ఘన జీవామృతం, ద్రవ జీవామృతం తయారీ విధానాలను పరిశీలించారు. అనంతరం రైతు శివమ్మ మామిడి తోటలో





చేపట్టిన ఏడాది పొడవునా ఆదాయం అందించే సాగు విధానం, గుళికల రూపంలో తయారు చేసిన ప్రకృతి వ్యవసాయ పదార్థాల వినియోగాన్ని పరిశీలించారు. రెండు ఎకరాల్లో సాగు చేస్తున్న వక్క తోటలోనూ ఈ విధానాన్ని పరిశీలించారు. తదుపరి బొజ్జన్న అర ఎకరంలో చేపట్టిన మునగ ఆధారిత కూరగాయల సాగును, మొరపురగుండు గ్రామంలో లలిత ఒక ఎకరంలో సాగు చేస్తున్న వివిధ రకాల కూరగాయల తోటను సందర్శించారు. ఈ సందర్భంగా మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులతో ప్రత్యేకంగా మాట్లాడి ప్రకృతి వ్యవసాయం ద్వారా కుటుంబాల ఆహార భద్రత, ఆదాయం, జీవన విధానంలో వస్తున్న మార్పుల గురించి తెలుసుకున్నారు. అనంతరం రూప ఒక ఎకరంలో టీడు భూమిని సాగులోకి తీసుకొచ్చి చేపట్టిన ప్రకృతి వ్యవసాయ విధానాన్ని



పరిశీలించారు. బుదిపల్లె గ్రామంలోని జమాలబండలో మల్బరీ తోటలో అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులను, మంజుల రెండు ఎకరాల్లో చేపట్టిన నాణ్యమైన కూరగాయల సాగును సందర్శించారు. ఈ పర్యటనలో ప్రకృతి వ్యవసాయంలో అనుసరిస్తున్న సాగు సూత్రాలు, విత్తనాల ఎంపిక, పంటల వైవిధ్యం, నేల ఆరోగ్య పరిరక్షణ, సహజ ఎరువుల వినియోగం తదితర అంశాలను ప్రకృతి వ్యవసాయ విభాగం రాష్ట్రస్థాయి ప్రతినిధి డాక్టర్ నవీన్, సాంకేతిక నిపుణుడు రమేష్ వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మురసు తుపాను నేపథ్యంలో..

అప్రమత్తంగా ఉండాలి..

అత్యవసర సాయానికి ప్రత్యేక నియంత్రణ కేంద్రం

పుట్టపర్తి, నవంబరు 2, అమరావతి వెలుగు : మురసు తుపాను ప్రభావం దృష్ట్యా శ్రీ సత్యసాయి జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ సూచించారు.



తుపాను కారణంగా భారీ వర్షాలు, ఈదురుగాలులు, ఇతర ప్రకృతి వైపరీత్యాలు సంభవించే అవకాశం ఉన్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు సహాయం అందించేందుకు జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేక నియంత్రణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వర్షాలు, వరదలు, చెట్లు లేదా విద్యుత్ స్తంభాలు నేలకొరగడం, రహదారులపై నీరు నిలిచిపోవడం వంటి సమస్యలు ఎదురైతే వెంటనే 08555-289039 నంబరుకు సమాచారం అందించాలని సూచించారు. అవసరమైన సహాయం కోసం ఈ ఫోన్ నంబరును సంప్రదించాలని కోరారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు జారీ చేసే సూచనలు తప్పనిసరిగా పాటించాలని, అత్యవసరం కాని ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ తీగలు, నీటితో నిండిన ప్రాంతాలు, ప్రమాదకర ప్రదేశాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యమిస్తూ జిల్లా యంత్రాంగం అవసరమైన ముందస్తు చర్యలు చేపడుతోందని కలెక్టర్ పేర్కొన్నారు.

మున్సిపల్ ఓట్ల లెక్కింపునకు...

పటిష్ట బందోబస్తు

: జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్

పుట్టపర్తి, నవంబరు2, అమరావతి వెలుగు : శ్రీ సత్యసాయి జిల్లాలో మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ తెలిపారు. కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద అన్ని రకాల భద్రతా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. విధులు నిర్వహించే పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. కౌంటింగ్ సిబ్బంది, అభ్యర్థుల ఏజెంట్లకు ప్రత్యేక ప్రవేశ మార్గాలు ఏర్పాటు చేసి, క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించిన అనంతరమే కేంద్రాల్లోకి అనుమతించాలని



సూచించారు. కౌంటింగ్ హాళ్లలోకి సెల్‌ఫోన్లు, పెన్నులు, కాగితాలు తదితర నిషేధిత వస్తువులను తీసుకెళ్లేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు. స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన నిఘా కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, భద్రతా విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని అధికారులకు సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నందున ఫలితాలు వెలువడిన అనంతరం విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా పూర్తయ్యేందుకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ఏజెంట్లు, ప్రజలు పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ విజ్ఞప్తి చేశారు

ఖరీఫ్ కరువు పరిస్థితుల పరిశీలనకు...

ములకనూరులో కేంద్ర బృందం పర్యటన

అనంతపురం, నవంబరు 2, అమరావతి వెలుగు : ఖరీఫ్-2026 కరువు పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు కేంద్ర బృందం సోమవారం కంబదూరు మండలం ములకనూరు గ్రామాన్ని సందర్శించింది. వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి చిన్మయ్ గోట్మారే నేతృత్వంలోని బృందం కరువు ప్రభావిత ప్రాంతాల్లో పంటల పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల అమలును పరిశీలించింది. ఈ సందర్భంగా ములకనూరు గ్రామానికి చెందిన రైతు జి. బాబు నాయుడుకు చెందిన 4.50 ఎకరాల వర్షాధార మామిడి తోటను కేంద్ర బృందం సందర్శించింది. జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రతినిధి లక్ష్మానాయక్ గుళికల రూపంలో విత్తనాలను సిద్ధం చేసి వర్షాకాలానికి ముందే విత్తే విధానం గురించి వివరించారు. ఈ పద్ధతిలో విత్తనాలకు రక్షణ కల్పించడం, నేలలోని తేమను వినియోగించుకునే సామర్థ్యాన్ని పెంచడం, మొలకెత్తే ప్రక్రియకు అనుకూల పరిస్థితులు కల్పించడం వంటి ప్రయోజనాలను తెలియజేశారు. మామిడి తోటల్లో అంతర పంటల సాగు చేపట్టడం వల్ల నేలలో జీవవైవిధ్యం పెరగడంతో పాటు



భూసారం మెరుగుపడుతుందని వివరించారు. నేలపై పంటల కవచం ఏర్పడటం ద్వారా తేమ నిల్వ ఉంటుందని, ప్రధాన పంటతో పాటు అంతర పంటల సాగు ద్వారా అదనపు దిగుబడి, ఆదాయం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ విధానం వల్ల కరువు పరిస్థితులను సమర్థంగా ఎదుర్కోవడంతో పాటు సాగు ఖర్చులు తగ్గించుకొని రైతులు స్థిరమైన ఆదాయం పొందవచ్చని వివరించారు. కేంద్ర బృందం రైతు బాబు నాయుడుతో మాట్లాడి సాగు అనుభవాలు, పంటల దిగుబడి, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా కలుగుతున్న ప్రయోజనాలను అడిగి తెలుసుకుంది. కరువు పరిస్థితులను తట్టుకునేందుకు రైతులు అనుసరిస్తున్న విధానాలను క్షేత్రస్థాయిలో పరిశీలించింది. కేంద్ర కరువు బృందం నాయకుడు చిన్మయ్ గోట్మారేతో పాటు జాతీయ పంటల అంచనా కేంద్రం సహాయ సంచాలకులు ప్రభాకాంతి, గ్రామీణాభివృద్ధి శాఖ ఉప కార్యదర్శి వినోద్ సమంత్, వ్యయ విభాగం ఉప సంచాలకులు పంకజ్ పహాడియా, రాష్ట్ర పర్యవేక్షణ, మూల్యాంకన సంచాలకులు ఎన్.వి. సతీష్ సీమకుర్తి, రాష్ట్ర వ్యవసాయ సంచాలకులు మనజీర్ జీలానీ సమూన్, జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జిల్లాలో 1,500 హెక్టార్లలో...

సుగంధ, ఔషధ మొక్కల సాగు లక్ష్యం

పుట్టపర్తి, నవంబరు2, అమరావతి వెలుగు : శ్రీ సత్యసాయి జిల్లాలో సుగంధ, ఔషధ మొక్కల సాగును విస్తృతంగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. జిల్లాలో సుమారు 1,300 నుంచి 1,500 హెక్టార్ల విస్తీర్ణంలో మెడిసినల్, అరోమాటిక్ ప్లాంట్స్ సాగు చేపట్టాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ అంశంపై సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర మెడిసినల్ ప్లాంట్స్ బోర్డు సీఈవో చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భారత ప్రభుత్వ సహకారంతో అమలు చేయనున్న ఈ పథకాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. అటవీ శాఖ, సామాజిక అటవీ శాఖ, ఉద్యానవన, వ్యవసాయ, పట్టు పరిశ్రమ శాఖలతో పాటు డ్వామాకు సాగు లక్ష్యాలను కేటాయించారు. అటవీ శాఖకు 200 హెక్టార్లు, సామాజిక అటవీ శాఖకు 200, ఉద్యానవన శాఖకు 200, వ్యవసాయ శాఖకు 200, పట్టు పరిశ్రమ శాఖకు 50, డ్వామాకు 600 హెక్టార్ల చొప్పున లక్ష్యాలను నిర్దేశించారు. సుగంధ, ఔషధ మొక్కల సాగుపై అసక్తి ఉన్న రైతులను గుర్తించడంతో పాటు అనువైన భూములను వెంటనే ఎంపిక చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా అటవీ ప్రాంతాలకు అనుకుని ఉన్న భూములకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాలకు అనుగుణంగా సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపొందించి రెండు రోజుల్లోగా సమర్పించాలని స్పష్టం చేశారు. రైతులకు ఈ సాగు ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించి, వారిని భాగస్వాములను చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో డీఎఫ్‌వో చక్రపాణి, సోషల్ ఫారెస్ట్రీ డీఎఫ్‌వో శ్రీనివాసులు, ఉద్యానవన శాఖ అధికారి జయకుమార్, జిల్లా వ్యవసాయ అధికారి కృష్ణయ్య, డ్వామా పీడీ విజయప్రసాద్, సెరికల్చర్ జేడీ శోభారాణి, మెడిసినల్ ప్లాంట్స్ బోర్డు సీఈవో చంద్రశేఖర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడే మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు

అనంతపురం, నవంబరు 2, అమరావతి వెలుగు : జిల్లాలో ఆదివారం నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు మంగళవారం ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. అనంతపురం నగరపాలక సంస్థతో పాటు తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, రాయదుర్గం, కళ్యాణదుర్గం పురపాలక సంఘాల ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం నిబంధనల మేరకు జిల్లా యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేసింది. అనంతపురం లోని ఎస్-ఎస్‌బీఎన్ కళాశాలలో నగరపాలక సంస్థ ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. మేయర్ అభ్య ర్థులు, వార్డు కార్పొరేటర్ అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో అధికారులు లెక్కింపు





ప్రక్రియ ప్రారంభిస్తారు. కౌంటింగ్ సిబ్బందికి, అనుమతి పొందిన అభ్యర్థుల ఏజెంట్లకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వారికి కేటాయించిన బల్లల వద్ద, నిర్దేశిత కంచెల వెనుక నుంచి లెక్కింపు ప్రక్రియను పరిశీలించేలా ఏర్పాట్లు కల్పించారు. ముందుగా తపాలా ఓట్లను లెక్కించిన అనంతరం సాధారణ ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. నగరపాలక సంస్థ పరిధిలోని 62 వార్డులకు 62 బల్లలు, మేయర్ అభ్యర్థుల ఓట్ల లెక్కింపు కోసం 24 బల్లలను ఏర్పాటు చేశారు. ప్రతి బల్ల వద్ద అవసరమైన సిబ్బందిని నియమించారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, జిల్లా ఎస్పీ, ఎన్నికల పరిశీలకులు కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా పూర్తయ్యేలా అధికారులు అన్ని చర్యలు తీసుకున్నారు.

ఒడిసిలో వైఎస్సార్‌సీపీ శ్రేణులకు

దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి దిశానిర్దేశం

ఓబుళ దేవర చెరువు , అమరావతి వెలుగు : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఒడిసి మండలంలో ఎన్నికల ప్రచార కార్యక్రమాలను విస్తృతం చేశారు. మండలంలోని కొండక మర్ల, గాజుకుంటపల్లి, నల్లగుట్లపల్లి, వేమా రెడ్డిపల్లె గ్రామాలతో పాటు మహమ్మదాబాద్ క్రాస్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ, ప్రచార వ్యూహాలు, పార్టీ కార్యక్రమాలపై శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. గ్రామాలవారీగా పార్టీ పరిస్థితిని సమీక్షిస్తూ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పుట్టపర్తి నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. పుట్టపర్తి కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయడం, జాతీయ రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం కల్పించడం, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవడం వంటి అంశాలను ప్రస్తావించారు. జిల్లా ఏర్పాటు ద్వారా పరిపాలనా సేవలు ప్రజలకు మరింత చేరువయ్యాయని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలును వివరిస్తూ వైఎస్సార్ పెన్షన్ కానుక, రైతు భరోసా, అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా వంటి పథకాల ద్వారా





వివిధ వర్గాల ప్రజలకు ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. రైతులకు పెట్టుబడి సాయం, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పింఛన్లు, విద్యార్థుల తల్లులకు ఆర్థిక చేయూత, మహిళా సంఘాలకు రుణ ఉపశమనం వంటి కార్యక్రమాలను గత ప్రభుత్వ పాలనలో అమలు చేసినట్లు వివరించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి పార్టీ శ్రేణులకు ప్రజలకు వివరించాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తల పాత్ర కీలకమని పేర్కొంటూ ప్రతి గ్రామంలో ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకోవాలని శ్రీధర్‌రెడ్డి సూచించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రభుత్వ పథకాల అమలు, గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యలపై ప్రజలకు వివరించాలని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తూ ఎన్నికల కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. కొండకమర్ల, గాజుకుంటపల్లి, నల్లగుట్లపల్లి, వేమారెడ్డిపల్లె గ్రామాలతో పాటు మహమ్మదాబాద్ క్రాస్‌లో జరిగిన సమావేశాల్లో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

Edited, Printed, Published & Owned by : JANAPATI VENKATA RAMESH BABU, #1-1189-21A, NGO Colony, KADIRI - 515591, Anantapuramu (Dist.), AP (State) and Printed at
M/s AK PUBLICATIONS, #1-1189-2A, NGO Colony, Kadiri - 515591, Anantapuramu (Dist), AP (State) and Published at #1-1189-21A, NGO Colony, Kadiri - 515591, Anantapuramu (Dist.), (A.P),
Editor : JANAPATI VENKATA RAMESH BABU, RNI No. APTEL / 2022 / 85169, E-mail : amaravathivelugu@gmail.com, Cell: 9440814576